- మెట్రో రెండో దశ విస్తరణకు వేగంగా అడుగులు
- రూ.24,269 కోట్లతో 5 కారిడార్ల పనులకు శ్రీకారం
- ఇప్పటికే కేంద్రానికి చేరిన డీపీఆర్
- త్వరలో పనులను ప్రారంభించే అవకాశం
- ప్రత్యేక దృష్టి సారించిన సీఎం రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ ఏడాది పాలనలో మెట్రోకు అత్యంత ప్రాధాన్యత

**నగర రవాణాలో కీలకంగా మారిన మెట్రోరైలు రెండోదశ విస్తరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం రెండోదశపై నిర్లక్ష్యం వహిస్తే, కేవలం పది నెలల కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులకు శ్రీకారం చుట్టింది. 5 కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేరకు రూ.24,269 కోట్లతో నిర్మాణం చేసేందుకు ముందుకుసాగుతోంది. రెండోదశ పనులకు సంబంధించిన డిటైల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) నవంబర్ 4న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన ప్రభుత్వం అనుమతి కోసం ఎదురుచూస్తోంది.**

# పది నెలల్లోనే చకచకా..



**కాంగ్రెస్ ఏడాది పాలన**

హైదరాబాద్‌సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత నగరాభివృద్ధిలో భాగంగా మెట్రో రైలు విస్తరణపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. గత ప్రభుత్వం రెండోదశలో ప్రతిపాదించిన మూడు కారిడార్లను రద్దు చేసి నగరంలోని అన్ని ప్రాంతాలకూ మెట్రోరైలును నడిపించాలని భావించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రోరైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులతో వరుస సమీక్షలు చేపట్టారు. తమ ప్రభుత్వ హయాంలోనే నగరవాసులకు మెట్రోను మరింతగా అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

**రెండో దశ కారిడార్ల వివరాలివీ..**

| మార్గం (కారిడార్- నంబర్) | కిలోమీటర్లు | స్టేషన్లు | వ్యయం (రూ.కోట్లు) | రోజువారీ ప్యాసింజర్ల అంచనా (2028నాటికి) |
|---|---|---|---|---|
| నాగోల్-ఎయిర్‌పోర్టు (4) | 36.8 | 24 | 11,226 | 3,70,000 |
| రాయదుర్గ్-కోకాపేట్ (5) | 11.6 | 08 | 4,318 | 92,000 |
| ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (6) | 7.5 | 06 | 2,741 | 72,000 |
| మియాపూర్-పటాన్‌చెరు (7) | 13.4 | 10 | 4,107 | 1,65,000 |
| ఎల్‌బీనగర్-హయత్‌నగర్ (8) | 7.1 | 06 | 1,877 | 97,000 |
| | 76.4 | 54 | 24,269 | 7,96,000 |

## ఒకసారి గతాన్ని పరిశీలిస్తే..

నగరంలో మొదటిదశ ప్రాజెక్టును 2012లో ప్రారంభించి 2017లో పూర్తిచేశారు. ప్రైవేట్, పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో ఎల్‌అండ్‌టీ ఈ ప్రాజెక్టును చేపట్టింది. రెండోదశ పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు నిర్ణయించాయి. 30% నిధులు రాష్ట్ర ప్రభుత్వ వాటాగా, 18% కేంద్రం, 4% పీపీపీ మోడల్‌లో, మిగతా 48% నిధులను కేంద్రం సావరీన్ గ్యారంటీతో అంతర్జాతీయ బ్యాంకుల నుంచి నిధులు సమకూర్చుకోవాలని చూస్తున్నారు. ఇలా చేయడం ద్వారా పనులు సకాలంలో పూర్తయ్యే అవకాశం కనిపిస్తోందని భావిస్తున్నారు.

## అధికారంలోకి వచ్చిన 2 నెలలకే..

మొదటి దశలో చేపట్టిన రెండో కారిడార్ జేబీఎస్-ఫలక్‌నుమాలో ఎంజీబీఎస్ దాటిన తర్వాత ప్రార్థనా మందిరాలు అడ్డురావడంతో పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చాయి. దీంతో ప్రతిపాదించిన 15.5 కిలోమీటర్ల పనుల్లో 5.5 కిలోమీటర్లను నిలిపివేసి ఎంజీబీఎస్ వరకు మాత్రమే

మిగతా 6వ పేజీలో..

# పది నెలల్లోనే చకచకా..

(5వ పేజీ తరువాయి)

మెట్రోను పూర్తిచేశారు. దీంతో అప్పటినుంచి పాతబస్తీ వాసులు మెట్రో కోసం ఎదురుచూస్తున్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పనులను పూర్తిచేస్తానని అసెంబ్లీ సాక్షిగా పలుమార్లు చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే పాతబస్తీ పనులకు మోక్షం కల్పించారు. ఈ ఏడాది మార్చిలో ఫలక్‌నుమా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. వచ్చే ఎన్నికల్లోపు ఓల్డ్‌సిటీలో మెట్రోను తీసుకొస్తామని చెప్పడంతో వారు సంతోషంగా ఎదురుచూస్తున్నారు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో నగరంలో మెట్రో విస్తరణపై స్పెషల్ ఫోకస్‌పెట్టడంతో పనులు  చకాచకా జరుగుతున్నాయి.